నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 22 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

భారత్ బంద్ పాక్షికం

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సమితి సభ్యులు

ఎదులాపురం, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్ ఆదిలాబాద్ జిల్లాలో పాక్షికంగా ముగిసింది. ఉదయం నుంచి దుకాణాలు తెరుచుకోలేదు. ముందుగానే వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసివేశారు. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడక్కడ తెరిచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో చేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మేకల మల్లన్న, కో కన్వీనర్ ప్రజ్ఞా కుమార్, అశోక్, గంగన్న విఠల్, శోభాతాయి, తుల్జాపూరే పాల్గొన్నారు.

రైతులకు తప్పని తిప్పలు

హస్నాపూర్‌లో బ్యాంకు ఎదుట నిరీక్షిస్తున్న రైతులు

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 21 : రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయకపోవడంతో చాలా మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. మండలంలోని ఉట్నూర్, శ్యాంపూర్, హస్నాపూర్ గ్రామాల్లో రైతులు తమకు రుణమాఫీ వచ్చిందో రాలేదో అని అయోమయంలో ఉన్నారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు వచ్చాయో లేదో తెలుసుకునేందుకు వ్యవసాయ పనులు వదిలి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూ తమ సమస్యలను తెలిజేస్తున్నారు. రుణమాఫీ వల్ల రైతులకు తిప్పలు తప్పడం లేదు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ జానకీ షర్మిల

ఆధునిక పోలీసుగా వ్యవహరిద్దాం

నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

కుభీర్, ఆగస్టు 20 : మానవ హక్కులను గౌరవిస్తూ వృత్తిపరంగా ఆధునిక పోలీసుగా ఉండడానికి అవిశ్రాంతంగా కృషి చేయాలని ఎస్పీ జానకీ షర్మిల పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం కుభీర్ పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్నేహపూర్వక, బాధ్యతాయుతమైన పాత్రను పోషించాలని సూచించారు. జిల్లా సరిహద్దు మహారాష్ట్రను ఆనుకుని ఉండడం, దేశీదారు, నిషేధత గుట్కా సరఫరా కాకుండా నిఘాను పటిష్ట పరిచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా స్టేషన్‌లోకి అడుగు పెట్టిన ఎస్పీకి ఎస్సై రవీందర్ మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. భైంసా ఏఎస్పీ అవినాశ్, రూరల్ సీఐ నైలు, ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

61 శాతం మందికి టోకరా

రుణమాఫీ కాకపోవడానికి మేం ఏం పాపం చేశామంటూ ప్రశ్నిస్తున్న హస్నాపూర్ రైతులు

● 117 మంబిలో 46 మంబికే రుణమాఫీ వర్తింపు ● తాంసి మండలంలోని హస్నాపూర్ రైతుల అవస్థలు

తాంసి, ఆగస్టు 21 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని హస్నాపూర్ రైతులు కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్నారు. ఈనెల 15వ తేదీలోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పిందని వాపోయారు. పట్టా పాసు పుస్తకంపై రుణం ఇచ్చినోళ్లే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సంబంధం లేని అంశాలతో మాఫీకి మంగళం పాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్నాపూర్ (పీఏసీఎస్) సొసైటీలో 117 మంది రైతులు రుణాలు తీసుకుంటే మూడు విడుతలు కలిసి మొత్తం రూ.43.76 లక్షలు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇందులో 46 మందికి అనగా 39 శాతం మాత్రమే మాఫీ అయింది. 61 శాతం అనగా 71 మందికి మాఫీ కాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' గ్రామంలో ఫీల్డ్ విజిట్ చేయగా తమ గోడు వెల్లబోసుకున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం అందరికీ రుణమాఫీ చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. అనేక కొర్రీలు పెట్టి మాఫీ ఎగ్గొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. పట్టా పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అంటున్నారు.

రేషన్ కార్డు లేకుంటే రైతులం కాదా..

నాకు హస్నాపూర్ శివారులో నాలుగెకరాల 26 గంటల భూమి ఉంది. నేను రైతునే రూ.1.75 లక్షల రుణం తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నా. రేషన్ కార్డు లేదని రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. ఎన్నికల్లో పట్టా పాస్ పుస్తకం ఉండి రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ అవుతుందని రేవంత్‌రెడ్డి చెప్పి ఇప్పుడు 31 కొర్రీలు పెడుతూ రైతులకు పంగనామాలు పెడుతున్నారు. పట్టా పాస్ పుస్తకం ఉండి రుణం తీసుకున్న రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలి. లేదంటే రైతులందరూ రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్తారు.

- ఎల్మ కృష్ణారెడ్డి, రైతు, హస్నాపూర్.

రానున్న ఎలక్షన్‌లో బుద్ధి చెప్తాం..

నేను రూ.1.50 లక్షల రుణం తీసుకున్నా. అప్పుడు ఎమ్మెల్యే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి రైతులందరికీ రూ.2 లక్షలు బాకీ మాఫీ చేస్తానని చెప్పిండు. ఇప్పుడేమో రేషన్ కార్డు ఉన్నోళ్లకే మాఫీ అంటుండు. మా ఊర్లో మస్తు మంది రైతులకు రేషన్ కార్డు ఉన్న మాఫీ కాలే. నాకైతే రేషన్ కార్డు లేదు. గా ఎలక్షన్‌లో చెప్పినట్టు నేను తీసుకున్న లోన్ బాకీ మాఫీ అవుతుందని అనుకున్నా. ఎలక్షన్‌లో చెప్పినట్టు పాసు పుస్తకం ఉన్న కాస్తకారులకు రూ.2 లక్షల బాకీ మాఫీ చేయకుంటే రానున్న ఎలక్షన్‌లో కాంగ్రెస్ సర్కార్‌కు తగిన బుద్ధి చెప్తాం.

- గోక కృష్ణారెడ్డి, రైతు, హస్నాపూర్.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేను రుణమాఫీకి అర్హుడిని. అయినా మాఫీ కాలేదు. నాకు హస్నాపూర్ శివారులో ఐదెకరాల 20 గుంటల భూమి ఉంది. రూ.1.50 లక్షల క్రాప్ లోన్ తీసుకున్నా. మూడు విడుతల్లో ఏ జాబితాలోనూ నా పేరు లేదు. ఎన్నో కష్టాలు పడి వ్యవసాయం చేసుకుంటున్నా. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించి ఇప్పుడు రైతులను మోసం చేస్తున్నాడు. ఇది మంచి పద్ధతి కాదు.

- ముక్కెర కిష్టయ్య, రైతు, హస్నాపూర్.

మూడో లిస్టులో నా పేరు రాలే..

నాకున్నది రెండున్నర ఎకరాలు. నేను తీసుకున్నది రూ.1.50 లక్షలు. రైతులకు దశలవారీగా రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. బ్యాంకుకు పోయి అడిగితే రాలేదని బ్యాంకోళ్లు చెప్పిన్రు. వచ్చే లిస్టులో వస్తుందన్నారు. ఈసారైనా రుణమాఫీ జరుగుతుందేమోనని ఆశ పడ్డ. వచ్చిన మూడో లిస్టులోనూ నా పేరు లేదు. రూ.1.50 లక్షల కూడా మాఫీ కాలే. ఎందుకు రాలేదని బ్యాంకుకు వెళ్లి అడిగిన. ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అధికారుల వద్దకు పోతే వస్తాయని అంటున్నారు. ప్రభుత్వం రైతు రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్నది. మా పరిస్థితేమో గిట్లున్నది.

- ఎం.రమేశ్, రైతు, హస్నాపూర్.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నేటి నుంచి ఎల్ ఆర్ ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఆగస్టు 21 : భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నేటి(గురువారం) నుంచి మొబైల్ యాప్ ద్వారా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే నంబర్లు, అప్లికేషన్‌ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుదారులను అనవసర ఇబ్బందులకు గురి చేయకూడదని, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే, వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారని, క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా అది ప్రైవేట్ స్థలమేనా? లేక ప్రభుత్వ స్థలమా? అన్నది పక్కాగా నిర్ధారించుకోవాలని అన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

కేంద్ర నిధులపై ప్రచారం కల్పించాలి

- ఎంపీ గొడం నగేశ్

ఎదులాపురం, ఆగస్టు 21 : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించడంతోపాటు విస్తృత ప్రచారం కల్పించాలని ఎంపీ గొడం నగేశ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ మీటింగ్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. శాఖలవారీగా కేంద్ర ప్రభుత్వ నిధులు, పనులు, యూసీల వివరాలను తెలుసుకున్నారు. పనులు, అభివృద్ధి పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఆర్డీవో సాయన్న, డీఎస్‌వో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గొడం నగేశ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

అన్నదాతలకు అండగా..

● నేడు జిల్లాలో బీఆర్ఎస్ ఆందోళనలు ● రుణమాఫీ చేయాలని డిమాండ్ ● విజయవంతం చేయాలని నాయకుల విన్నపం

ఆదిలాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ ఆందోళనకు బీఆర్ఎస్ అండగా నిలువనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నేడు(గురువారం) ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టనున్నాయి. నియోజకవర్గ కేంద్రాలతోపాటు మండలం కేంద్రాల్లో రైతులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ సగం మంది రైతులకు వర్తించలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా ఐదు రోజుల నుంచి రైతులు ఆందోళన బాట పట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శవయాత్రలు, దిష్టిబొమ్మల దహనాలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి నిరసన తెలుపుతున్నారు.

అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టారు

- మాజీ మంత్రి జోగు రామన్న

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి దేవుళ్లపై ఒట్టు పెట్టుకుని మోసం చేశాడని, అన్నం పెట్టే రైతులకు సున్నం పెట్టారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాపాసు పుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని నేడు ఆదిలాబాద్ ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు నియోజకవర్గ రైతులు పార్టీలకు అతీతంగా భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు బ్యాంకుల్లో రైతులు రూ. 2 లక్షలు రుణం తీసుకోవాలని, తాము అధికారంలోకి రాగానే డిసెంబరు 7న రద్దు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను నిండా ముంచారని మండిపడ్డారు. రుణమాఫీ కానీ రైతులకు రైతు వేదికలు వచ్చి ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ విషయంలో నాన్చుడు ధోరణి వీడనాడాలని సూచించారు. రూ. 2 లక్షలపైగా అప్పులు ఉన్న రైతులకు పైన డబ్బులు చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని అంటున్నారని ఈ విషయంలో బ్యాంకు అధికారులు బాండ్స్ రాసిస్తారా అని ప్రశ్నించారు. రైతులు నిర్వహించే ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, విజ్జిగిరి నారాయణ, అజయ్, శ్రీనివాస్, మార్నెట్టి సుదర్శన్ పాల్గొన్నారు.

ధర్నాకు రైతులు తరలిరావాలి..

- అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంపై నేడు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇచ్చోడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు చేపడుతున్న ఆందోళన కార్యక్రమానికి రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేసేంత వరకు ఆందోళనలు చేస్తామని తెలిపారు.

నేరాల అడ్డుకట్టకు అవగాహన కీలకం

- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, ఆగస్టు 21 : సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని, సరైన సమయంలో ఫిర్యాదు చేస్తే బాధితులకు పోయిన డబ్బులు తిరిగి చెల్లించే అవకాశం ఉందని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, సిబ్బంది సింగర్వార్ సంజీవ్‌కుమార్, సంతోష్, రియాజ్ పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రుణాలు మాఫీ చెయ్యాలని ధర్నా

నేరడిగొండ, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేస్తోందని మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నేరడిగొండలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నాకు దిగారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేర్చాలని, లేదంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కేసులను ఎత్తివేయాలి

బజార్‌హత్నూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట రైతులు

బజార్‌హత్నూర్, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీని చేయకపోవడంతో న్యాయం కోసం పోరాడిన రైతన్నలపై కేసులు పెట్టడం సమంజసం కాదని కేసు నమోదైన రైతన్నలు వాపోయారు. రుణమాఫీ కాలేదని సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన రైతులను బుధవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కేసు నమోదు అయిన రైతులు అల్కె గణేశ్, డుబ్బుల చంద్రశేఖర్, తూరటి భోజన్న, చట్ల వినిల్ మాట్లాడుతూ.. షరతులతో కూడిన రుణమాఫీ కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీని చేయాలని డిమాండ్ చేశారు. మాపై అన్యాయంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని అన్నారు.

జీతం చెల్లించాలి

నార్నూర్, ఆగస్టు 21 : నార్నూర్ మండలంలోని 23 పంచాయతీల పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఏడు నెలల జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ అధికారి స్వప్నశీలకు పారిశుధ్య కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబ పోషణ భారంగా మారిందని, తక్షణమే స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీవోను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కిషన్, సంతోష్, రాందాస్, అమృత, భీంరావ్, నాగోరావ్, దినేశ్, వినోద్, భీంరావ్, హన్మంత్‌రావ్, జైపాల్, సుమేత్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ ఎంపీవో స్వప్నశీలకు వినతిపత్రాన్ని అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు

ఎదులాపురం, ఆగస్టు 21 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో కీలకంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు ఆరోపించారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2008 సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు నాగమణి, సుజాత, లక్ష్మి, పుష్ప, లక్ష్మి, రాధ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ఉద్యోగులకు శిక్షణ

బాసర, ఆగస్టు 21 : బాసర ఆర్జీయూకేటీ ఉద్యోగులకు బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్‌లో ఉత్తమ పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ మూడు రోజులపాటు కొనసాగనుంది. ఎంసీహెచ్ ఆర్‌డీ, చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ ఐఏఎస్ సహకారంతో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ చొరవతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలేజ్ఎట్, టెక్నికల్ ఎడ్యూకేషన్ కమిషనర్ దేవసేన, ప్రొఫెసర్ మజూరు హుస్సేన్‌లు వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. పాలన, నాయకత్వం, యూనివర్సిటీ పాలన పరమైన అంశాలను తుది రూపు ఇవ్వడం, సమర్థవంతమైన బోర్డు నిర్వహణ, కమ్యూనికేషన్, వ్యూహాత్మక ప్రణాళిక, అమలు విధానాల గురించి వివరించారు. బడ్జెట్, ఆర్థిక ప్రణాళిక, వనరులు కేటాయింపు, ఆప్టిమైజేషన్, ఫైనాన్షియల్ రిపోర్టింగ్, సమ్మతి, తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్స్ హరికృష్ణ, రాజు, శ్రీనివాస్, మిట్టపల్లి, ఇమామ్, చిన్నారెడ్డి, దస్తగిరి సతీష్‌రాయల పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ఉద్యోగుల శిక్షణలో మాట్లాడుతున్న వక్తలు